అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ప్రజాపాలనలో జెడ్పీ చైర్ పర్సన్ సరిత
- ఆరు గ్యారంటీలకు దరఖాస్తుల వెల్లువ
- పలు గ్రామ సభల్లో ఎమ్మెల్యే విజయుడు
- దరఖాస్తులు స్వీకరణలో జెడ్పీ సీఈఓ కాంతమ్మ



గార్లపాడులో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల అర్బన్: అర్హులందరికి సంక్షేమ పథకాలు అందుతాయని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 22, 23వ వార్డుల్లో ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తు స్వీకరణ కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అనిత నర్సింహులు, భాస్కర్ యాదవ్, మధుసూదన్‌బాబు, జమ్మిచేడు ఆనంద్, సైఫ్, ఖయ్యూం, రామకృష్ణ, సమి, కలీం ఉన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని చింతలకుంట, పాగుంట గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలనలో జెడ్పీచైర్ పర్సన్ సరిత పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు దరఖాస్తులు స్వీకరించాలన్నారు.

అర్హులను గుర్తించాలి

ధరూరు: ఆరు గ్యారంటీలపై అధికారులు నిర్లక్ష్యం చేయరాదని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హులను గుర్తించాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. గార్లపాడులో ఆమె పాల్గొని దరఖాస్తులను పరిశీలించారు. రాజకీయాలకు అతీతంగా అర్హులను గుర్తించాలన్నారు.

గట్టు: అర్హులందరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని, ప్రతి కుటుంబం తప్పని సరిగా దరఖాస్తు చేసుకోవాలని జెడ్పీచైర్ పర్సన్ సరిత కోరారు. మాచర్లలో ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించారు. సల్కాపురం, తారాపురం, మాచర్ల, మిట్టదొడ్డి గ్రామాల్లో మొత్తం 2126 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.

అలంపూర్: మున్సిపాలిటీలో దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, కమిషనర్ గోల్కొండ నర్సయ్య తెలిపారు. అలంపూర్ మున్సిపాలిటీలోని 1, 2వ వార్డులో దరఖాస్తుల స్వీకరణ కొనసాగించారు. 1 వార్డులో 249, ఇతరములు 73, 2వ వార్డులో 374 ఇతరములు 73, మొత్తం 623 దరఖాస్తులు, ఇతరములు 146 దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

మల్దకల్: మండలంలోని విఠలాపురం, మల్లెందొడ్డి, అమరవాయి గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తులు వెల్లువెత్తాయి. అమరవాయిలో తహసీల్దార్ హరికృష్ణ, విఠలాపురం, మల్లెందొడ్డిలో ఎంపీ డీఓ కృష్ణయ్య దరఖాస్తులు స్వీకరించారు. ఆయా గ్రామాలలో 2187 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.

అయిజ: ప్రజా పాలన దరఖాస్తులకు అధికారులు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించారు. మున్సిపాలిటీలోని 5,10,15,20 వార్డుల్లో మొత్తం1775 దరఖాస్తులు వచ్చాయి. మండలంలోని ఎక్లాస్‌పురం, సంకాపురం, పులికల్‌లో దరఖాస్తులు స్వీకరించారు. మూడు గ్రామ పంచాయతీల్లో కలిపి మొత్తం 2191 దరఖాస్తులు వచ్చాయి.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల్లోని పెద్దదిన్నెలో 623, ఉదండాపురంలో 583, పుటాన్‌దొడ్డిలో 866, సాసనూలులో 707 అభయహస్తం దరఖాస్తులు వచ్చాయి.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలో ప్రజాపాలన దరఖాస్తులు వెల్లువెత్తాయి. రామాపురంలో 1040, కోయిల్‌దిన్నెలో 314, మొత్తం 1354 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ రవీంద్ర తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ముషాహిదాబేగం, తహసీల్దార్ జ్యోతి, ఎంపీఓ తిరుపతన్న ఉన్నారు.

వడ్డేపల్లి మున్సిపాలిటీలో

వడ్డేపల్లి పుర పరిధిలోని 9వ వార్డులో 410, 10వ వార్డులో 265, ఇతర వార్డుల నుంచి 80, మొత్తం 755 దరఖాస్తులు వచ్చినట్లు కమిషనర్ లక్ష్మారెడ్డి తెలిపారు.

రాజోళి: మండలంలో ప్రజాపాలనకు 2196 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ గోవిందు రావ్ తెలిపారు. మాన్‌దొడ్డిలో 1143, పెద్ద తాండ్రపాడులో నిర్వహించిన గ్రామసభలో 1053 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు.

కేటీదొడ్డి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనలో భాగంగా మండలంలోని చింతలకుంట, పాగుంట గ్రామాలలో 1173 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



అలంపూర్‌లో మాట్లాడుతున్న మనోరమ



కోయిల్‌దిన్నెలో..



మాన్‌దొడ్డిలో..



సంకాపురంలో..



అమరవాయిలో..

ప్రజాపాలనలో అన్ని సవ్యంగా చేయాలి

ఉండవెల్లి: ప్రజాపాలన పథకాలపై దరఖాస్తులలో ప్రజల అభిప్రాయాలను నమోదు చేయాలని జెడ్పీ సీఈఓ కాంతమ్మ అన్నారు. మండలంలోని శేరుపల్లె, కలుగొట్ల గ్రామాల్లో ప్రజాపాలన నిర్వహించారు. ప్రజాపాలన దరఖాస్తులు సవ్యంగా చేయాలని సూచించారు. శేరుపల్లెలో 240, కలుగోట్లలో 512 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

ప్రజలను ఇబ్బందులు పెట్టొద్దు

మానవపాడు: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ కాంతమ్మ సూచించారు. మండలంలోని చెన్నిపాడు, మానవపాడు, గ్రామాల్లో దరఖాస్తులను పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణలో ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి నాగేంద్రం, ఎంపీడీఓ రమణరావు, తహసీల్దార్ జుబెర్ మొహిన్‌ద్దీన్, ఆర్‌ఐ రజనీకాంత్‌రెడ్డి, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



దరఖాస్తు పత్రాలు అందజేస్తున్న జెడ్పీసీఈఓ

పథకాలను సద్వినియోగం చేసుకోండి

అయిజ: రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పర్దీపురంలో ప్రజాపాలన సభకు ఎమ్మెల్యే హాజరై దరఖాస్తులు స్వీకరించారు. అయిజ మున్సిపాలిటీ పరిధిలోని పర్దీపురం గ్రా మాన్ని గ్రామ పంచాయతీగా మార్చాలని కోరారు. అనంతరం అయిజ ప్రీమియర్ లీగ్ సీజన్ 8వ క్రి కెట్ క్రీడల ఎమ్మెల్యే ప్రారంభించారు.

మానవపాడు: ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతి ఒ క్కరూ ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే విజేయు డు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో దరఖాస్తుల స్వీకరణ నిర్వహించారు. అభయహస్తం సంబంధించి ఆరు దరఖాస్తులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోఆప్షన్ నెంబర్ మహ్మద్ సిరాజ్ అహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, అయ్యన్న, హరినాథ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, శాంతన్న, విశ్వనాథ్‌నాయుడు పాల్గొన్నారు.



మానవపాడులోదరఖాస్తుల స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజేయుడు

క్లుప్తంగా

జేఎన్టీయూ ప్రొఫెసర్ ప్రత్యేక పూజలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామిని బుధవారం జేఎన్టీయూ ప్రొఫెసర్ వెంకట్రామన్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యాచంద్రారెడ్డి, అర్చకులు మధుసూదనాచారి, రవిచారి, అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు అరవిందరావు, సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కొత్త దేవరపల్లికి చెందిన ఉప్పరి వెంకట్రాముడు (52) అకాల మృతి చెందడంతో బాధిత కుటుంబానికి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

గట్టులో..

గట్టు: మండలంలోని బల్గెరకు చెందిన హమాలీ సంఘం సభ్యుడు నల్లగట్టు ఆంజనేయులు కుటుంబానికి హమాలీ సంఘం తరుపున బుధవారం రూ.10,500ల ఆర్థిక సాయం అందజేశారు. నల్లగట్టు ఆంజనేయులు బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందగా, హమాలీ సంఘం సభ్యులు ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు.

ఆలయంలో పడి పూజ



ఉండవెల్లి: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం సమయంలో గురుస్వామి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయ శర్మ, స్వాములు పాల్గొన్నారు.

మహిళను వేధించిన యువకులపై ఫిర్యాదు

గద్వాల క్రైం: మహిళను తరచూ ఫోన్‌లో వేధింపులకు గురి చేస్తున్న యువకులపై బుధవారం ఎస్పీ రితిరాజ్‌కు ఫిర్యాదు చేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన మహిళను అదే పట్టణంలో ఉండే వేణు, నవీన్‌లు ఫోన్‌లో తరచూ వేధింపులకు గురి చేస్తున్నారు. వేధింపులు తాళలేక మహిళ ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేసి రక్షణ కల్పించాలని కోరింది. ఈ విషయంపై ఎస్పీ స్పందించి ఆకతాయిలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. మహిళ ఫిర్యాదును పట్టణ ఎస్ఐ శ్రీకాంత్‌ను విచారించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో మహిళలపై ఎవరైనా అనుచితంగా వ్యవహరించినా వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఎస్పీ తెలిపింది.

బాధితులకు బైక్ అప్పగింత



మానవపాడు: మండలకేంద్రం నుంచి జాతీయ రహదారికి వెళ్లే ప్రధాన రహదారి జూరాల కాల్వలో పడిన బైక్‌ను బుధవారం ఎస్ఐ రాము ఆర్ గార్లపాడుకు చెందిన రాజుకు అప్పగించారు. రాజుకు కొడుకు, కూతురు ఉన్నారు. కుమారుడు అక్కను చూసేందుకు కొత్తకోటకు వెళ్లి తిరుగు ప్రయాణంలో మానవపాడు దాటాక అదుపు తప్పి బైక్ కాల్వలో పడింది. దీంతో బైక్‌ను పోలీసులు గుర్తించడంతో వారికి బైక్‌ను అప్పగించారు.

తాగునీటి కోసం కాలనీ వాసుల నిరసన



గద్వాల: ఏడో వార్డు పరిధిలోని పిలిగుండ్ల కాలనీ ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. తాగునీటి అవసరాలు తీర్చాలని డిమాండ్ చేస్తూ బుధవారం వార్డు కౌన్సిలర్ దౌలు ఆధ్వర్యంలో కాలనీ వాసులు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కాలనీ ఏర్పడి 15 ఏళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు ప్రజలు తాగునీటి సౌకర్యానికి నోచుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు.తక్షణమే తాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మాచర్లలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ సరిత

గట్టు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జెడ్పీ చైర్మన్ పర్సన్ సరిత కోరారు. బుధవారం మాచర్లలోని ఉన్నత పాఠశాలను జెడ్పీ చైర్ పర్సన్ సరిత ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫా, మధ్యాహ్న భోజనం, నైపుణ్యం కల్గిన ఉపాధ్యాయుల చేత బోధన లభిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. పాఠశాలలో విద్యార్థులకు రోజు వారిగా మెనూ ప్రకారం అందిస్తున్న భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, హెడ్మాస్టర్లు పర్యవేక్షించాలని సరిత సూచించారు. ఆమె వెంట మాజీ సర్పంచు వరలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు వెంకటస్వామిగౌడు, మాచర్ల లక్ష్మణ్ పాల్గొన్నారు.

రాముడి అక్షతల ఊరేగింపు

ఎర్రవల్లిచౌరస్తా: అయోధ్యలో శ్రీరాముడి ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా అక్షతలు పంపిణీ కార్యక్రమాన్ని ఎర్రవల్లి మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు శివాంజనేయస్వామి ఆలయం నుంచి అక్షతలను ఆంజనేయస్వామి ఆలయం వరకు ఊరేగించారు. అక్షతలను పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు.

ఉద్యమకారులు సద్వినియోగం చేసుకోవాలి

గద్వాల అర్బన్: ఉద్యమకారులు ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని 1969 ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు మోహన్‌రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రజాపాలనలో స్వీకరిస్తున్న దరఖాస్తులో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అమరవీరులు, ఉద్యమకారులకు 250చ.గజాల ఇంటి స్థలం వివరాల్లో ఎఫ్‌ఐఆర్ నంబర్, సంవత్సరం, జైలుకెళ్లితే వాటి వివరాలు తెలపాలని పేర్కొన్నారు.

సామాజిక విప్లవమూర్తి సావిత్రిబాయి పూలే



అలంపూర్‌లో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సామాజిక సేవా సమితి సభ్యులు

గట్టు: స్త్రీలకు చదువుకునే అవకాశం కల్పించాలని, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం సావిత్రి బాయి పూలే తన జీవితాన్ని త్యాగం చేశారని జెడ్పీ చైర్ పర్సన్ సరిత తెలిపారు. ఆమె జయంతి సందర్భంగా మాచర్ల గాంధీచౌక్‌లో చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్, మాజీ సర్పంచు వరలక్ష్మీ వెంకటస్వామిగౌడు పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ దగ్గర కేవీపీఎస్, సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సావిత్రి బాయి పూలే జయంతి నిర్వహించారు. బల్గెరలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా చేశారు.

సావిత్రి బాయి జీవితం స్ఫూర్తిదాయకం

అలంపూర్: స్త్రీ జాతి విముక్తి కోసం అహర్నిశలు కృషి చేసిన సావిత్రిబాయి పూలే జీవితం స్ఫూర్తిదాయకమని తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డిపోగు ప్రేమదాసు, సీనియర్ నాయకులు మల్లెపోగు లక్ష్మణ్ మాదిగ కొనియాడారు. అలంపూర్ మున్సిపాలిటీలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. సామాజిక విప్లవ మూర్తి సావిత్రిబాయి పూలే అని ఎంఈఓ అశోక్ కుమార్ అన్నారు. అలంపూర్‌లోని హరిజనవాడ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని సామాజిక సేవా సమితి డైరెక్టర్ నరసింహ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. అనంతరం ఎనిమిది మంది మహిళా ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించారు.

కేవీపీఎస్ అధ్వర్యంలో..

పట్టణంలోని కార్యాలయంలో మండల కేవీపీఎస్ కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సావిత్రీబాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.

మహిళా సాధికారత పూలేతో ప్రారంభం

శాంతినగర్: మహిళా సాధికారత కోసం రెండు శతాబ్దాల క్రితమే పోరాటం చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని ప్రధానోపాధ్యాయులు హరున్‌రషీద్ అన్నారు. వడ్డేపల్లి మండలంలోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు సురేఖ, ధనలక్ష్మి, వసంతలను సన్మానించారు.

అయిజ: మండల కేంద్రం, గ్రామాల్లో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు, ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులు సావిత్రీబా యి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయం, కలుగోట్లలోని కస్తూర్బా పాఠశాలలో సావిత్రి బాయి పూలే జయంతి నిర్వహించారు. సీఐటీయూ నాయకులు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె రాఘవేంద్ర పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా కరస్పాండెంట్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేసి, మహిళా విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేసి వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేష్, అంజలి, భారతి, నవిత, మంజుల, స్వర్ణలత పావని పాల్గొన్నారు.



గట్టులో సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



కస్తూర్బా పాఠశాలలో సావిత్రిబాయి పూలే వేషధారణలో విద్యార్థిని

‘మధ్యాహ్నం’ బిల్లులు అందేనా?

- నాలుగు నెలలుగా నిరీక్షణ
- వంట నిర్వహణ భారంగా ఏజెన్సీలు
- పట్టించుకోని అధికారులు



అమరవాయిలో వంట చేస్తున్న నిర్వాహకులు



మల్దకల్‌లో భోజనం చేస్తున్న నిర్వాహకులు

మల్దకల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం బిల్లులు నాలుగు నెలలుగా అందకపోవడంతో ఏజెన్సీ నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెలా ప్రభుత్వం నుంచి బిల్లులు అందాల్సి ఉండగా పెరిగిన ధరలకు అనుగుణంగా ఒక్కో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.10వేల నుంచి రూ.50వేలకు వరకు కిరాణం, కూరగాయలు, గుడ్లు, అరటి పండ్ల బిల్లులు అవుతున్నాయని ఏజెన్సీ మహిళలు వాపోతున్నారు. అప్పులు చేసి ప్రతిరోజు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని, ఇక మధ్యాహ్న భోజనం చేసేందుకు తమ వల్ల కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగే కొనసాగితే తాము ఏజెన్సీల నుంచి తప్పుకోవాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు. అప్పులు చేసి సరుకులు తెచ్చినా బిల్లులు సకాలంలో ప్రభుత్వం నుంచి రావడం లేదని, సరుకులిచ్చిన వ్యాపారులు డబ్బుల కోసం వత్తిడి చేస్తున్నారని, దీంతో మధ్యాహ్న భోజనం వండలేక, అప్పులు తీర్చలేక ప్రతిరోజు మనోవేదనకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఏజెన్సీ నిర్వాహకులు పేర్కొన్నారు. మరో వారం రోజుల్లో నాలుగైదు పాఠశాలల్లో కూడా వంట చేయడం మానేస్తామని వంట ఏజెన్సీ మహిళలు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ముందుగానే తెలియచేస్తున్నట్లు వారు తెలిపారు. మల్దకల్ మండలంలో మొత్తం 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 4 ఉన్నత, 27 ప్రాథమిక పాఠశాలల్లో మొత్తం 6,848 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం 40 పాఠశాలలకు వంట ఏజెన్సీలు 40 ఉండగా వాటిలో 112 మంది వంట నిర్వాహకులు పనిచేస్తున్నారు. వారికి ప్రతి నెలా రూ.10లక్షల బిల్లులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉండగా, నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉండటంతో సుమారు రూ.40 లక్షలకు పైగా పెండింగ్‌లో ఉన్నట్లు వంట ఏజెన్సీ నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు వారానికి మూడు సార్లు గుడ్లు అందించాలని నిబంధనలు విధించింది. ప్రభుత్వం గుడ్డుకు రూ.4 ఇస్తుండగా, ప్రస్తుతం మార్కెట్‌లో గుడ్డు ధర రూ.6లకుపైగా ఉంది. అదనంగా రూ.2 చొప్పున ఏజెన్సీ వారిపై భారం పడుతోంది. ఇతరులతో వడ్డీలకు తెచ్చి విద్యార్థులకు వారానికి మూడు సార్లు గుడ్లు, అరటి పండ్లు అందిస్తున్నారు. సెప్టెంబర్ నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయంపై పలుమార్లు వంట ఏజెన్సీ నిర్వాహకులు విద్యాశాఖ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వంట కోసం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను త్వరగా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని వంట ఏజెన్సీ నిర్వాహకులు కోరుతున్నారు.


అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



నాలుగు నెలలకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్న విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రభు త్వం నుంచి నిధులు మంజూరులో కొంత ఆలస్యమైంది. వచ్చిన వెంటనే వంట ఏజెన్సీలకు బిల్లులు చెల్లిస్తాం.

– కొండారెడ్డి, ఇన్‌చార్జి ఎంఈఓ మల్దకల్


వడ్డీలు కట్టలేకపోతున్నాం..



ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించక పోవడంతో వడ్డీలకు తెచ్చి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, గుడ్లు అందించాం. గుడ్ల ధరలు పెరగడంతో మ రింత భారంగా ఉంది. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేకపో తున్నాం. ప్రభుత్వం స్పందించి బిల్లులు చెల్లించి ఆదుకోవాలి.

– యాదగిరి, అమరవాయి, వంట ఏజెన్సీ


గౌరవ వేతనం పెంచాలి



ప్రభుత్వం వంట ఏజెన్సీలకు చెల్లించే గౌరవ వేతనం పెంచాలి. ప్రతి నెలా రూ.10వేల నుంచి రూ.50వేల వరకు అప్పులు తెచ్చి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. ఇప్పటికే నాలుగు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అధికారులు బిల్లులు అందేలా చర్యలు తీసుకొని తమకు గౌరవ వేతనం పెంచాలి.

– గోవర్ధనమ్మ, వంట ఏజెన్సీ, మల్దకల్

సరుకులు ఇవ్వడం లేదు



విద్యార్థులకు వడ్డించే మ ధ్యాహ్న భోజనం కోసం కి రాణం దుకాణంలో సరుకులు ఉద్దెర ఇవ్వడం లేదు. ఇప్పటికే నాలుగు నెలలుగా బిల్లులు పెండింగ్ ఉండటంతో సరుకులు తీసుకునేందుకు ఇబ్బందులెదురవుతున్నాయి. ఇతరుల నుంచి తీసుకున్న అప్పులను చెల్లించేందుకు బిల్లులు రాకపోవడంతో వారి నుంచి ఒత్తిడి ఎక్కువైంది. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి.

– సత్యమ్మ, మల్దకల్

గుడి నిర్మాణానికి రూ.2లక్షల విరాళం

మానవపాడు: శ్రీబాలయోగి శివనారాయణస్వామి అలయ నిర్మాణం కోసం బుధవారం నారాయణ పురం గ్రామానికి చెందిన జీకే లక్ష్మీదేవమ్మ, చిన్ననారాయణ వారి జ్ఞాపకార్థం కుమారులు వెంకటేశ్వర్ల, జయదేవుడు, కృష్ణదాస్, లక్ష్మీనారాయణ రూ.2 లక్షల 16 రూపాయలు విరాళం అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు శ్రీబాలయోగి శివనారాయణస్వామి గుడి నిర్మాణం కోసం దాతలు సహకరించాలని అలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వీరారెడ్డి, లింగేశ్వర్, రాఘవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరసింహ, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.



నారాయణపురంలో విరాళం ఇస్తున్న దాత